# మనిషి

చింతా సత్యనారాయణ



అతని రెండు కళ్ళూ ఆ రోడ్డుమీదే ఉన్నాయి.
వసంత ఇంకా రావడం లేదు.

చిరాగ్గా వాచీ చూసుకున్నాడు. తొమ్మిదీ ఇరవై.
అంటే, ఇంకో నాలుగయిదు నిముషాల్లో వస్తుందన్నమాట.

"ఈ ఆడవాళ్లెప్పుడూ ఇంతే! ఎప్పుడూ ఒక్క క్షణం ముందు రారు. ఆదరా బాదరా వచ్చి బస్సింకా రాలేదు, ఇంకా రాలేదని కొట్టుకుపోతుంటారు." అనుకున్నాడు విసుగ్గా.

ఉదయపు ఎండ ఎర్రబడుతోంది.

మొహంమీంచి గాగుల్స్ తీసి ఓ చేత్తో పట్టుకుని, రెండో చేత్తో జేబు రుమాలుతీసి ముఖం తుడుచుకున్నాడు.

అతనొచ్చి అప్పుడే పావుగంటయింది. అతను వెళ్ళవలసిన బస్సులు రెండు వెళ్లిపోయాయి. మూడో బస్సు వెళ్లిపోవడానికి సిద్ధంగావుంది.

"ఈ దేవిగార్ని కళ్ళారా, తనివితీరా చూసుకుందామని పావుగంట ముందు రావడం—రాణీగారేమో చీర సింగారించి వచ్చేటప్పటికి బస్సు రావడం—పోనీ ఆఫీసులోనైనా, ఏ కాంటీనులోనో కనిపిస్తుందా అంటే కుర్చీకి అతుక్కుపోతుందో, వాళ్ళ సెక్షన్ ఆఫీసరు కదలనివ్వడో కాని, అసలు దర్శనమే ఉండదు. సాయంత్రమైనా ఓ అయిదు నిముషాలు కులాసాగా కబుర్లు చెప్పుకుందామా అంటే, ఆఫీసునుంచి బయటికి రాగానే బస్సు సిద్ధం. పోనీ ఆదివారమైనా ఏ పబ్లిక్ గార్డెన్స్‌లోనో, నౌబత్ పహాడ్ మీదో దర్శనమిస్తుందా అంటే—అదీ లేదు. ఇల్లే వైకుంఠం, వాకిలే వారణాసి,

మోహన్‌కి చాలా కోపంగావుంది. పరిచయమయి మూడు నెలలయింది కాని, కథమాత్రం అంగుళం ముందుకు కదల్లేదు.

రోడ్డు దాటుతున్న వసంతను చూడగానే అతని కళ్ళల్లో దీపాలు వెలిగాయి. పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు. ఆమె 'నమస్తే' అని రెండుచేతులూ జోడించి అతనికి కొంచెం ఎడంగా నిల్చుంది. అతను గర్వంగా, ఆనందంగా, లాటరీలో లక్షరూపాయలొచ్చిన వాడిలా ఆ బస్సు స్టాపులో నుంచున్న అందరివైపూ చూశాడు, చూశారా నాకు ఎంత అందమైన గరల్‌ఫ్రెండ్ ఉందో అన్నట్లు!

షోకేసులో పెట్టిన అందమైన బొమ్మలా వుంది ఆమె.

ఆమె కళ్లు చేపపిల్లలా తళుక్ తళుక్ మంటున్నాయి.

ఆమె బుగ్గలు కాశ్మీర్ ఆపిళ్ళలా కొరుక్కుతినేయాలనిపిస్తున్నాయి.

ఆమె నిల్చున్న తీరు అజంతా శిల్పాన్ని మరిపిస్తోంది.

మోహన్‌కి పిచ్చెక్కిపోతోంది. బెంగుళూరులో ఉన్నప్పుడు హేమను చూసినప్పుడుకూడా ఇలాగే పిచ్చెక్కిపోయేది. హేమకూడా ఇలాంటి పెంకి ఘటమే! తను తెలివయినవాడు కాబట్టి, ఏ ఆడపిల్లను ఏ వలతో పట్టుకోవాలో, ఎలా లొంగదీసుకోవాలో తెలిసినవాడు కాబట్టి రెండునెలల్లో కథ క్లయిమాక్సుకు తీసుకొచ్చాడు. ఆరు నెలల్లో కథ ముగించాడు.

అవకాశాలు అరుదుగా వస్తాయి. వచ్చిన అవకాశాన్ని చెయ్యిజారిపోనివ్వకూడదు. ఒక్కొక్కసారి అవకాశాలు రానే రావు. తెలివిగా, మెలకువగా మనమే అవకాశాలు సృష్టించాలి_అతని మెదడు పదునుగా పనిచేస్తోంది.

వాళ్లు వెళ్ళవలసినబస్సు గర్భిణీస్త్రీలా ఆయాసపడుతూ ఆగింది. కొమ్మ పట్టుకుని కోతులు వ్రేలాడుతున్నట్లు జనం వేలాడుతున్నారు. ఇద్దరూ ఒకరిమొహాలొకరు చూసుకుంటూ అసహాయంగా నిలబడిపోయారు. కాని మోహన్‌కి మనసులో సంతోషంగానేవుంది. ఇంకోబస్సుకూడా ఖాళీలేకుండావస్తే వసంతా, తనూ ఇలా ఆటోరిక్షాలో వెళ్ళవచ్చు!

"దీనిముందు బస్సూ ఇలాగే వెళ్లింది. పోనీలెండి, నెక్స్టట్ బస్సులో వెడదాం" అన్నాడు ఆమెకు కొంచెం దగ్గరగా జరిగి.

టైము అప్పుడే తొమ్మిదీ యాభై.

వసంతకు తొందరగావుంది. ఆ వచ్చే బస్సయినా ఖాళీగా వస్తుందా?

మరో పదినిముషాలకు జనంతో క్రిక్కిరిసిన బస్సు వచ్చింది. ఆగినట్లేఆగి, పురిటికి పుట్టింటికి వెడుతున్న ఆడపడచులాగా ఆయాసంగా కదిలి, వేగం అందుకుంది.

వసంత అసహాయంగా నిలబడిపోయి వాచీ చూసుకుంది.

అమ్మో...పదయిపోయింది!

వెళ్లిపోతున్న బస్సువంక చిరాగ్గా, చూసినట్లు చూసి, ఆటోను పిలిచాడు మోహన్



'ఊర్వశి' శారద

"ఇవాళ్టికీబస్సులింతే_ఆఫీసుకు లేటయ్యేటట్లుంది రండి" అని చొరవగా ఆమె చెయ్యి పట్టుకులాగి, ఆటోలో కూర్చున్నాడు. వసంతకూ ఆటోలో కూర్చోక తప్పలేదు.

"ఇలా అనుకోకుండా అవకాశాలు కలిసొస్తే, వారంరోజుల్లో నువ్వు నాదానివి. థాంక్ గాడ్!" అనుకుని నవ్వుకున్నాడు.

ఆటో మంచి వేగంగా పరుగిడుతోంది.

కుదుపులకు ఒకరిభుజాలొకరికి ఒరుసుకుంటున్నాయి.

వసంత ఒకవైపుకు ఒదిగి కూర్చుంది

మోహన్ కళ్లు ఆమె అందాన్ని, అంగ సౌష్టవాన్ని, నిమ్నోన్నతాల సొగ

కుల్నీ, సోయగాల్నీ పరిశీలిస్తున్నాయి. ఆమె కట్టుకున్న చీర బీదదని చెపుతోంది. కట్టుకున్నతీరు సంస్కారాన్ని చూపుతోంది. అందాన్ని రెట్టింపు చేస్తోంది.

ఇంత అందాన్ని తను చేజిక్కించుకుంటున్నందుకు, అతను ఒక్క క్షణం గర్వపడి ఛాతీ విరుచుకున్నాడు. ఈ మూడు నెలలుగా తను పడిన కష్టాన్ని గుర్తుచేసుకుని చివరికి గెలుపు తనదే అవుతున్నందుకు తన అదృష్టాన్ని అభినందించుకున్నాడు.

“ఆ శేషుగాడిని మక్కలిరగ్గొట్టేసి, ఉస్మానియా హాస్పిటల్లో జాయిను చేసేద్దామనుకున్నాను కాని, వాడి పెళ్ళాం మొహం చూసి వూరుకున్నాను. అయినా గట్టి వార్నింగే ఇచ్చానులెండి. వెర్రి వేషాలేస్తే, మూసీనదిలో ముంచేస్తానన్నాను” అని గట్టిగా వూపిరి పీల్చుకుని ఆమె కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూసాడు.

“ఆయనకు పెళ్ళికూడా అయిందాండీ?” అని ఆశ్చర్యపోయింది వసంత.

“పెళ్ళేనేమిటండీ బాబూ, ఆరునెలల పిల్లాడు కూడాను.”

వసంతకు ఏడుపొచ్చింది. పెళ్ళయి పిల్లల్నికంటూ, ఇంకా తన్ను వెంటాడుతున్నాడంటే ఏమనుకోవాలి? మనిషేనా? భగవాన్, నన్ను ఆడపిల్లగా ఎందుకు పుట్టించావ్?

మొన్న సాయంత్రం కూరగాయలు కొనుక్కుని ఇంటికి వెడుతుంటే శేషగిరి కలిసాడు. తనూ అటే వెడుతున్నానంటూ కూడావచ్చాడు. “మీరు చీర విప్పేసి గౌనేసుకుంటే రాక్వెల్ వెల్ష్‌లా గుంటారు” అన్నాడు. “మీ బుగ్గలు కాశ్మీర్ ఆపిల్లలా కొరుక్కుతినేయాలనిపిస్తాయి” అన్నాడు మళ్ళీ. తనుభయంతో వణికిపోయింది ఆ మాటలకు. తనఅదృష్టం బాగుండబట్టి, అదే సమయంలో మోహన్ సైకిల్ మీద ఎదురొచ్చాడు.

వసంతకు అన్నయ్య జ్ఞాపకంవచ్చాడు. తను హైస్కూల్లో చదువుకుంటున్నప్పుడు, ఇలాగే ఒక కుర్రాడు తన జడ పట్టుకు లాగాడు. తను అన్నయ్యతో ఏడుస్తూ చెబితే, ఆ మర్నాడు వాణ్ణి స్కూల్ ప్లే గ్రౌండులో చావగొట్టేశాడు. వాడు ఉక్రోషం పట్టలేక పెద్ద రాయిపెట్టి అన్నయ్య తలమీద కొట్టాడు. అన్నయ్య తలపగిలి ఎంత రక్తం కారిందని! నుదుటిమీది అప్పటిమచ్చ ఇప్పటికీ పోలేదు.


అన్నయ్య ఎక్కడున్నాడో? ఎన్ని కష్టాలు పడుతున్నాడో?

ఒక్క కుదుపు కుదిపి ఆటో ఆగింది. ఇద్దరూ దిగి, ఆఫీసులోకి నడిచారు.

* * *

మోహన్‌కి నిద్రపట్టడంలేదు. ఎదురుగా కిటికీలోంచి చల్లనిగాలి వీస్తోంది. కొత్తగా పెళ్ళయిన కుర్రాడికిమల్లే కులాసాగా నవ్వుతున్నాడు చంద్రుడు. చేతికందే దూరంలో ఓ కొంటె తారక అప్పుడే శోభనం గదిలో కడుగుపెట్టిన కొత్తపెళ్ళికూతురిలా మహాసిగ్గు పడిపోతోంది. బయటనున్న అమ్మలక్కలు గది తలుపులు బిగించినట్లు ఓ నల్లనిమబ్బు పరదా వేసింది.

రగ్గు మొహంమీదికిలాక్కుని, గట్టిగా




కళ్లుమూసుకున్నాడు మోహన్. ఉదయం ఆటోలో కూర్చున్నప్పుడు తను చూసిన వసంత అందాల్ని కళ్ళముందు చిత్రించుకున్నాడు. ఇంకా ఎన్నిరాత్రులిలా నిద్ర లేకుండా?

కాకినాడలో, కాలేజీలో చదువుకొనే టప్పుడు ఇలాగే నిద్రపట్టేదికాదు_ సుందరి జ్ఞాపకాలతో! ఆ తొలి యవ్వన దశలో, సుందరిలేకుండా జీవితం లేదని పించేది. ఆ రోజుల్లో ప్రేమంటే అదో వెర్రి! ప్రేమించాలని, పెళ్ళిచేసుకోవాలని అదో ఉబలాటం. సుందరికీ అంతే!'' ''మోహన్, నువ్వు లేకుండా క్షణంకూడా ఉండలేను'' అనేది.

కాని జీవితానికి ప్రేమ ఒక్కటే చాలదని, డబ్బు కూడా కావాలని క్రొత్తగా అప్పుడే తెలుసుకున్నాడతను. ఈ బ్రహ్మచారుల వేలంలో, ఒడ్డూ పొడుగూ చూసి, చదువూ సంధ్యా కొలిచి వేలకు వేలు గుమ్మరిస్తున్నప్పుడు ప్రేమా, పిచ్చీ అనడం ఎంత అవివేకం! ఈ ప్రేమ అనే మిథ్యాప్రపంచంనుంచి, మాయలోంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదనుకున్నాడు.

సుందరని వదిలించుకోవడానికి కొంత గొడవే అయింది.

''మీరు పెళ్ళిచేసుకుంటారని, మీరే నా సర్వస్వమని నా సర్వస్వం మీకర్పించాను. ఈ కడుపులో వూపిరిపోసుకుంటున్న మీ బాబుకు మూడో నెల. వాణ్ణీ, నన్నూ గొంతునులిమి చంపెయ్యండి'' అని ఏడ్చింది.

''నీ జాగ్రత్తలో నువ్వుంటున్నావనుకున్నాను కాని, మరీ కంట్రీబ్రూట్ లా

మూడో నెల, నాలుగో నెలని నాకు ఉరేస్తావనుకోలేదు. గుట్టుగా ఎబార్షన్ చేయించుకుని, నీ తాహతుకు తగ్గవాణ్ణి కట్టుకో! లేకపోతే ఓ మూడుమీటర్ల చేంతాడు కొనుక్కొని ఉరేసుకో!'' అన్నాడు తను నిష్కర్షగా.

అప్పుడలా తెలివిగా బయటపడబట్టి తను బ్రతికిపోయాడుగాని, లేకపోతే మెడకు ఉచ్చులా బిగుసుకుపోయేది సుందరి,

సుందరికంటె తెలివైనది, అందమైనది హేమ.

హేమ అపూర్వ సౌందర్యరాశి. అజంతా గుహల్లోంచి, ప్రాణంపోసుకుని నడిచివచ్చిన నాట్యమయూరిలా వుండేది. చక్రాల్లాంటి ఆ కళ్ళలో కళ్లు కలిపితే ఆమె సాన్నిధ్యంకోసం ఏ త్యాగమైనా చెయ్యొచ్చుననిపించేది.

ఆమెను చూసేకొద్దీ పిచ్చెక్కిపోయేది తనకు. ఆ అందం, ఆకర్షణ అలాంటివి. ఆమెతో నేర్పుగా పరిచయం సంపాదించుకున్నాడు. నెలరోజుల్లో స్నేహంగా మార్చుకున్నాడు. రెండు నెలల్లో కలిసి సినిమాలకెళ్లేంత దగ్గరయ్యారు.

తన అందంతో మత్తెక్కించి, తన హొయలతో రెచ్చగొట్టి,తన్ను బానిసను చేసుకుని మెళ్లో మూడుముళ్ళు వేయించుకోవాలని ఆమె పథకం.

తన తక్కువ తిన్నాడా?

మనసులు కలవాలి కాని పెళ్ళికేముందని మురిపించాడు. నీ తోడిదే నాకు లోకమని మైమరపించాడు. ముద్దులూ మురిపాలూ తీర్చుకున్నాడు.

కాని హేమను వదిలించుకోవడానికి చాలా కష్టపడవలసి వచ్చింది.

"మీరు నాకు మెళ్లో తాళి కట్టకపోవచ్చు. అయినా మీరు నా భర్తే! ఈ కడుపులో ప్రాణంపోసుకుంటున్న కసికందుకి తండ్రికూడా మీరే! తాళి పట్టకపోయినంతమాత్రాన ప్రకృతి మనల్ని క్షమిస్తుందా? ఈ ఇల్లు నాది. ఈ సంసారం నాది. ఇక్కణ్ణించి కదలనంటే కదలను'' అని హరం వేసుక్కూచుంది తన గదిలో.

ఆమె పట్టుదల, దీక్ష, మొండితనం చూస్తే తనక్కూడా భయంవేసింది.

అయినా తన తెలివితేటలు మెరుపులా పనిచేసాయి.

సమయానికి సాయంచేశాడు స్నేహితుడు మెడికల్ రిప్రజెంటిటివ్ శేఖర్. "నీ ఫోటోకి ఫ్రేము కట్టించి, వారానికో దండ వేయిస్తానురా!'' అని తన కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

అవి ఏ మాత్రలో తనకూ తెలీదు. నాలుగు దాటితే ప్రాణానికే ముప్పట! అందుకని మూడివ్వమన్నాడు. తప్పితే నాలుగివ్వమన్నాడు. రెండురోజుల్దాకా నిద్రలేవదన్నాడు.

ఆ రాత్రి పాలలో తను ఎన్ని కలిపాడో జ్ఞాపకంలేదు. మూడో? నాలుగో? ఆరో?

తెలివిగా పాలు త్రాగించి, నిద్రపుచ్చి బెంగుళూరునుంచి ఎగిరిపోయాడు. ఎగిరి, ఎగిరి హైద్రాబాదులో వాలాడు.

రెండునెలల వరకూ ఉద్యోగంలేక బాధపడ్డాడు.

ఆ తరువాత అదృష్టంకొద్దీ ఈ ఉద్యోగం దొరికింది. ఆ అదృష్టం రెట్టింపయి వసంత దొరికింది.

"ఇంకా ఎన్నాళ్ళిలా నిద్రరాని రాత్రులు?" అని బాధగా మూలిగాడు మోహన్.

* * *

తనకు దొరికిన ఏ చిన్న అవకాశాన్నీ విడిచిపెట్టలేదు మోహన్.

బస్సులు రద్దీగా వచ్చిన రోజులు తనకు పర్వదినాలనుకునేవాడు. ఆటోరిక్షాకిచ్చే నూటఅరవై పయిసలకీ నూరురెట్లుపోసినా దొరకని ఆనందం తను అనుభవిస్తున్నట్లు ఫీలయ్యేవాడు. కానీ ఎంతకాలమిలా గిల్టీగా సంతృప్తిపడడం?

"మళ్ళీ ఆదివారం మీరు నా రూముకు రండి. కాఫీతీసుకుని వెడుదురుగాని" అని ఎంతో ఆప్యాయత వుట్టిపడేలా ఆహ్వానించాడు.

ఆమె కళ్లు ఆనందంతో మిలమిలా మెరిసాయి.

"నేను తరువాత వస్తాను కానీండి, రేపు ఆదివారం మీరే మా ఇంటికిరండి" అంది.

ఆమె ఆహ్వానానికి ఆశ్చర్యపోయాడు మోహన్. "ఏమో అనుకున్నాను కాని, వసంతకూడా జాణే" అనుకున్నాడు.

"మీరు ఒంటరిగా ఉంటున్నారా?" అన్నాడు ఆమె కళ్లలోకి ఆత్రుతగా, ఆశగా చూస్తూ.

"లేదండీ, మా అమ్మా, తమ్ముడూ, చెల్లీ నేనూ ఉంటున్నాం" అంది.

ఆ సమాధానం అతనికి చాలా అసంతృప్తిగావుంది. వీళ్ళంతా ఎవరు దయ్యాల్లా? అనుకున్నాడు. అయినా తన అదృష్టం బాగుండి అవకాశంరావాలే గాని, ఆయమ్మ ఏ పురాణానికో పోక పోతుందా? ఈ తమ్ముడూ, చెల్లీ ఏ ఆటలకో పోకపోతారా?

మనసుండాలిగాని మార్గమేవుండదా?

ఆ శనివారం రెండవ శనివారం మూలంగా ఆఫీసుకు శలవు. వసంతని చూడనిరోజు అతనికి ఏమీ తోచదు. వసంత ఎలాగూ పిలిచింది కాబట్టి ఇంటికి వెడితే? అని ఆలోచించాడు. కాని తనకు




ఇల్లు తెలియదు. తను నిజంగా ఓ తెలివి తక్కువ ఈడియట్! 'మీరు మా ఇంటికి రండి' అని పిలిస్తే ఇల్లు ఎక్కడో అడిగాడా?

"ఒరే మోహన్, నీ తెలివి తేటల్ని ఎవడికో తాకట్టు పెట్టేశావురా!" అని విసుక్కున్నాడు.

ఆ సాయంత్రం నీటుగా బట్టలేసుకుని, ట్రిమ్ముగా టాయిలెటయి, గదికి తాళం వేసి బయలుదేరాడు. అలా ఓసారి వేంకటేశ్వరస్వామి గుడికివెళ్ళి స్వామి దర్శనం చేసుకుని, ఆ కళ్ళతోనే గుడికొచ్చిన సుందరాంగుల్ని దర్శనం చేసుకుంటే మనసుకు అదో వుల్లాసం.

హోటల్లో ఓ కప్పు కాఫీ తాగి, ఆ సెంటర్లో వచ్చేపోయే చిలకమ్మల్ని చూసుకుంటూ, హైహీల్సుహీరోయిన్లతో గమ్మత్తుగా కళ్ళు కలుపుతూ, అవకాశం చిక్కినపుడు ఢీకొట్టి 'సారీ' చెప్పుకోడం అదో విచిత్రమైన అనుభవం!

బస్సుస్టాపుకు దగ్గరగా పేవ్ మెంటు మీద నిల్చుని సిగరెట్టు వెలిగించాడు. బస్సుస్టాపు కన్నుల పండువుగా వుంది. రకరకాల చీరల్లో అమ్మాయిలు అప్పుడే ఫ్యాషన్ పెరేడ్ నుంచి వచ్చినట్లున్నారు. సాయంత్రపు నీరెండ వాళ్ళ చీరలకు క్రొత్త రంగులు పులుముతోంది.

"ఆ ఎర్రచీర కట్టుకున్న అమ్మాయి ఎవరోకాని, మొగుణ్ణి అమ్మేసి చీర కొనుక్కున్నట్లుగా వుంది." అనుకున్నాడు ఓ అమ్మాయిని చూసి. ఆ చీర అయిదొందలో, ఆరొందలో వుంటుందేమో అని ఆశ్చర్యపడ్డాడు. ఆ చీర కళ్ళను జిగేల్ మనిపిస్తోంది.

ఆ చీర వసంతకు కడితే ఎంత అందంగా వుంటుంది?

"ఏ అప్సరకాంతో ఇలా భూమిమీదికి షికారు కొచ్చినట్లుంటుంది. ఏ అజంతా శిల్పమో ప్రాణం పోసుకుని నాట్య ప్రదర్శనానికి వెడుతున్నట్లుంటుంది" అనుకున్నాడు.

కాని వసంత – చీర లేకుంటేనే బాగుంటుందేమో. గ్రీకు శిల్పంలా!

ఆ ఆలోచన రాగానే ఒళ్లు జలదరించింది.

బస్సువచ్చింది. అమ్మాయిలంతా ఒకళ్ళనొకళ్లు తోసుకుంటూ బస్సెక్కారు. అక్కడ అతనికి వుండ బుద్ధికాలేదు.

గుడికి బయలుదేరాడు.

ఎదురుగా వస్తోంది వసంత!

తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు.

ఏమిటీ యీ అదృష్టం?

తన్ను వెదుక్కుంటూ గుడిలోంచి వస్తున్న లక్ష్మీదేవిలా!

పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు. "గుడినించాండీ" అన్నాడు.

"అవునండీ. మీరూ గుడికి వెడుతున్నారా?" అంది రోడ్డుకు ఒక ప్రక్కగా నిల్చుని. తల స్నానం చేసిందేమో, కురులు పట్టుదారాల్లా నిగనిగలాడుతున్నాయి. నుదుట తీర్చిదిద్దిన తిలకం క్రొత్త అందాల్ని పొదుగుతోంది. చిరుగాలికి రెపరెపలాడుతున్న ముంగురులు ఆ అందాన్ని మూడింతలు చేస్తున్నాయి.



'కథానాయకుని కథ'లో ఎన్. టి. రామారావు, వాణిశ్రీ

ఆమె అడిగిన ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు మోహన్‌కి. "లేదండీ, ఏం తోచక అటూ ఇటూ తిరుగుతున్నాను." అన్నాడు_ అని ఇలాంటి సమాధానం చెప్పానేమిటి అని బాధపడ్డాడు.

"అయితే మా ఇంటికి రండి. దగ్గరే! కాఫీ తీసుకుని వెడుదురుగాని."

ఆ పిలుపుకు అతని గుండెల్లో వీణలు మ్రోగాయి, సితార్లు పలికాయి. అతని మనసు రబ్బరు బంతిలా గెంతింది.

అతను ఎదురు చూస్తున్నది ఆ పిలుపు కోసమే!

"మీరు పిలిచినపుడు కాదంటానా? పదండి" అని బయలుదేరాడు.

అతని సంతోషం రథంమీద వూరేగుతోంది.

ఈ అవకాశం ఇంత త్వరలో చిక్కుతుందని ఎప్పుడైనా కలగన్నాడా? వసంత తనకు తానుగా ఇలా ఆహ్వానిస్తుందని ఎప్పుడైనా వూహించాడా?

ఆమె సరసన అలా నడుస్తుంటే "నీ కోసం ఇలా ఎన్ని మైళ్ళయినా, ఎన్ని యోజనాలయినా నడవాలనిపిస్తుంది" అనుకున్నాడు.

అతని ఆలోచనలు గుర్రాలమీద స్వారీ చేస్తున్నాయి.

అతని కోరికలు అగ్నిశిఖల్లా నాలుకలు చాస్తున్నాయి.

"ఈ మూడు నెలలనుంచీ రక్తంమరుగు

తోంది. నువ్వు చూసిన ప్రతిచూపు, నవ్విన ప్రతి నవ్వూ నానరాల్ని తెంచింది. ఇంత కాలానికి, ఇంత తపస్సు తరువాత ఈ రక్తాన్ని చల్లబరుచుకునే అవకాశాన్ని కలిగిస్తున్నావు'' అనుకుని నవ్వుకున్నాడు.

వసంత మౌనంగా నడుస్తోంది. మోహన్ని ఆలోచనలు తినేస్తున్నాయి.

''తను ఇంట్లో అడుగుపెట్టేటప్పటికి వాళ్ళమ్మ ఏ పురాణానికో, ఏ 'సతీ సావిత్రి' సినిమాకో పోయివుంటుంది. తమ్ముడూ, చెల్లీ ఏ ప్రక్కింటి పిల్లలతోనో ఆడుకుంటూ వుంటారు.

వసంత తనకి కాఫీ ఇస్తుంది.

తను కాఫీ ప్రక్కనపెట్టి ''వసూ, నాకు కాఫీ కాదు—నీ పెదాల మీది పాయసం కావాలి'' అని గట్టిగా...''

తన వూహాలు మరీ పావురాల్లా ఎగురుతున్నాయే అని నవ్వుకున్నాడు.

వసంతకు అతనెందుకు నవ్వుతున్నాడో అర్థంకాలేదు. ''నవ్వుతున్నారేమండీ'' అంది.

మోహన్ దొరికిపోయిన దొంగలా ఇబ్బందిగా మొహంపెట్టి, ఏం చెప్పాలో తోచక ''ఆహా! మీ ఇల్లు ఇక్కడే అని చెప్పి ఇంతదూరం తీసుకొచ్చారేమిటా అని'' అన్నాడు.

అతన్ని చాలాదూరం నడిపించినందుకు వసంత నొచ్చుకుంది.

''వచ్చేశామండీ, ఆ చివర్న కన్పిస్తున్నదే ... ఆ పెంకుటిల్లే మా ఇల్లు'' అని చూపించింది.

ఆ సందు మరీ ఇరుకుగావుంది. కార్పొరేషనువాళ్లు పన్నులకోసం తప్ప, చెత్తా చెదారం వూడ్చడానికి ఎప్పుడూ రానట్లుగావుంది.

ఆ పెంకుటింటి ముందు నిక్కరుతో నుంచున్న కుర్రాణ్ణి చూసి, ''ఈ వెధవే అనుకుంటాను వసంత తమ్ముడు'' అనుకున్నాడు. అనుకున్నట్లుగానే ''అక్కా'' అంటూ పరుగు పరుగున ఎదురొచ్చాడు ఆ కుర్రాడు. అక్క చేతిలోంచి ప్లాస్టిక్ బాగ్ లాక్కుని, ఒకసారి వింతగా మోహన్ వంక చూసి ''అన్నయ్యానుకున్నానే అక్కా'' అంటూ బాగ్ పుచ్చుకుని ఇంట్లోకి పారిపోయాడు.

వాడన్నమాట మోహన్ కి అసహ్యంగా వుంది. ''మీ అక్క మొగుణ్ణనుకోలేదట్రా వెధవా?'' అని వాణ్ణి తన్నాలనిపించింది.

ఆ పెంకుటిల్లు బాగా పాతది. నడికప్పు ముసలాడి వెన్నెముకలా ఒంగి, ఒంకర్లు తిరిగిపోయింది. పెంకులు పడదామా, మానేద్దామా అని సందేహంగా చూస్తున్నట్లున్నాయి. మోహన్ కి భయం వేసింది—ఆ ఇల్లు తనమీద కూలిపోతుందేమోఅని.

భయపడుతూనే లోపల పాదం పెట్టాడు. గది శుభ్రంగా కడిగి ముగ్గులు పెట్టివుంది. గోడలు ఎన్నో సంవత్సరాలుగా సున్నం వేయక మసిబారివున్నా, శుభ్రంగావున్నాయి. గోడలకు అక్కడక్కడా రకరకాల దేవుళ్ళ కేలండర్లు తగిలించివున్నాయి. గదిలో ఓ మూలగా నవారుమంచం. ఆ మంచంమీద గుండెలదాకా దుప్పటి కప్పుకుని ఓ పదారేళ్ళ పిల్ల పడుకునుంది.

వసంత కుర్చీ వేసింది. ఆ కొయ్య కుర్చీలో కూర్చోవడం ఇబ్బందిగావున్నా ఆ పడుకున్న పిల్లను చూస్తూ అన్నీమరిచి పోయాడు.

మంచులో తడిసినముద్ద మందారంలా వుంది ఆమె మొహం. పెదాలు గులాబి రేకుల్లా పలుచగా, ఎర్రగా వున్నాయి. బుగ్గలు పూలగుత్తుల్లా వున్నాయి. అప్పుడే మొగ్గలు తొడుగుతున్న యవ్వనం ఆమె అందాలకి మెరుగులు దిద్దుతోంది.

అవతలి గదిలో వసంత కాఫీ ప్రయత్నంలో వుంది.

మోహన్‌కు ఆమెను ఎంత చూసినా తనివితీరడంలేదు. ఇలాంటి సౌందర్య దేవతలకి జన్మనిచ్చిన ఆ తల్లి ఇంకెంత అందంగా వుంటుందో? అని ఆలోచిస్తున్నాడు.

ఉలిక్కిపడి లేచినట్లు లేచింది ఆ అమ్మాయి. నిద్రకళ్లు నులుముకుని, మోహన్ని చూసి "నమస్తే" అంది. వసంత కాఫీకప్పుతో వచ్చింది.

"మా చెల్లెలండీ, విజయ" అని పరిచయం చేసింది, కాఫీకప్పు అందిస్తూ.

అక్కచెల్లెళ్ళిద్దరినీ మార్చి, మార్చి చూస్తున్నాడు మోహన్.

"లే విజీ, మొహం కడుక్కో" అని దుప్పటి కొద్దిగా పక్కకు తప్పించింది. విజయ సిగ్గుపడిపోతూ, దుప్పటి మళ్ళీ గుండెలదాకా లాక్కుంది.

"సిగ్గుపడకూడదమ్మా, వెళ్ళి మొహం కడుక్కునిరా, కాఫీ ఇస్తాను" అని దుప్పటి సగం తొలగించింది.

నడికప్పు కూలి తనమీద పడిపోయినట్లుగా అదిరిపడ్డాడు మోహన్.

విజయ దుప్పటి తప్పించుకుని, అక్క సాయంతో మంచందిగింది.

అతని రక్తమంతా నీరయిపోయినట్లు అచేతనంగా అలా గుడ్లప్పగించి చూస్తున్నాడు.

అంత అందమైన శరీరానికి అతుక్కుని ఎండిపోయిన కట్టెల్లాంటి రెండుకాళ్లు. అవి కాళ్లుకావు—ఎండిపోయిన రెండు జొప్పాయి గొట్టాలు.

నడవడానికి పనిచేయని ఆ రెండు కాళ్ళమీద దేకుతోంది విజయ.

గుండెల్ని ఎవరో పట్టకారుతో పిండినట్లుగా విలవిల్లాడిపోయాడు మోహన్.

"మా విజీకి చిన్నప్పుడు పోలియో వచ్చి, రెండుకాళ్ళూ పడిపోయాయి. డబ్బులేక సరైనవైద్యం చేయించలేదు నాన్నగారు. మళ్ళీ ఆకాళ్లు రాలేదు" అంది వసంత దీనంగా.

"దాని కాళ్లు చూసినప్పుడు నాకు దేవుడు లేడనిపిస్తూంది. ఉండి కనిపిస్తే దాని బంగారు జీవితం ఇలా ఎందుకుచేశావని నిలబెట్టి అడగాలనిపిస్తుంది" అంది.

విజయ దేకుకుంటూవచ్చి, అక్క సాయంతో మంచంమీద కూర్చుంది. తన మొహం ఎవరికీ చూపించడం ఇష్టంలేనట్లు తల దించుకుంది.

తమ్ముడు కాఫీ అందించి, వసంతదగ్గర కొచ్చి నిలబడ్డాడు.

మోహన్ కాఫీ తాగుతున్న విజయను చూస్తూ, మాటా మంతీ లేకుండా అచేతనంగా అలా కూర్చుండిపోయాడు. అతనికి మాట్లాడాలన్నా నోరు పెగలలేదు.

"మా అమ్మను చూద్దురుగాని రండి" అని ఆ రెండవగదిలోకి దారితీసిందివసంత.

మోహన్ మంత్రించిన మనిషిలా నడిచాడు.

మంచంమీద పడుకున్న ఆ శవంలాంటి మనిషిని చూసి ఒక్క క్షణం భయపడ్డాడు. ఆ తల్లి ఏడుపు మొదలు పెట్టింది. "వచ్చావురా బాబూ, ఈ ముసలితల్లిమీద దయగలిగి ఇప్పుడొచ్చావురా నాయనా, ఈ రెండేళ్ళూ ఎక్కడెక్కడ తిరిగావురా నాయనా" అంటూ.

"అన్నయ్యకాదే అమ్మా మోహన్ గారని మా ఆఫీసులో పనిచేస్తున్నారు" అని చెప్పి, మంచం దగ్గరగా ఓ స్టూలు వేసింది వసంత. తను తల్లి కాళ్ళదగ్గర కూర్చుంది.

ఆ తల్లిని చూస్తే మోహన్ కి భయం వేస్తోంది. ఒక కాలూ, చేయీ పడిపోయి కదలడంలేదు. నోరు కొద్దిగా వంకర్లు తిరిగింది. సరైన తిండిలేక శరీరం బాగా చిక్కిపోయింది.

"కూర్చో బాబూ." అంది ఆ తల్లి.

మోహన్ ఇబ్బందిగా ఆ స్టూలుమీద కూర్చున్నాడు. గది ఇరుకుగావుంది. ఒక వైపు స్టవ్, వంటపాత్రలు వున్నాయి. రెండోవైపు కిటికీ ఎదురుగా ఆ తల్లి మంచంవుంది. కిటికీప్రక్కన వసంత తండ్రిఫొటోవుంది. ఆ ఫోటోకి ఎప్పుడో వేసిన ఎండిపోయిన పూలదండ, ఎప్పుడో సగంకాలి ఆరిపోయిన అగరువత్తులూ ఉన్నాయి. ఆ ఫొటోలో మనిషికూడా, కాబూలీ అప్పులవాడు రక్తమంతా త్రాగేస్తే మిగిలిన ఎముకల పోగులా ఉన్నాడు.

"మందులు బాగా వాడుతున్నారా?" అన్నాడు మోహన్ ఆ తల్లినుద్దేశించి.

"ఏం మందులో నాయనా, ఆ ఆచారి దగ్గరే వాడుతున్నాను" అంది నీరసంగా ఆ తల్లి.

"కొంతకాలం ఇంగ్లీషు మందులు వాడామండీ! ఇక డబ్బు సర్దుకోలేక ఆయుర్వేద మందులు వాడుతున్నాం. ఆచార్లుగారు రోజూ వచ్చి చూస్తుంటారు" అంది వసంత దీనంగా.

ఆ తల్లి మొహంలోకి చూడడానికి ధైర్యం చాలలేదు మోహన్ కి.


"నేను పస్తులుండైనా మా అమ్మకు మందులు కొని బ్రతికించుకోవాలని వుంది మోహన్ బాబూ! కాని రోజురోజుకీ అమ్మ పరిస్థితి చూస్తే భయంవేస్తోంది."

ఆమె కళ్ళనుంచి టపటపా కన్నీటి బిందువులు. మోహన్ నిశ్చేష్టుడై పోయాడు. అప్రయత్నంగా ఆమె బుగ్గల మీది కన్నీళ్ళని తుడిచాడు. "ఛ...ఛ... ఏమిటిది వసంతా?... మేమంతా లేమూ? మీ అమ్మకేం భయంలేదు." అన్నాడు వూరడింపుగా.

"మా అన్నయ్య పిరికివాడు మోహన్ బాబూ! మాకూ మంచిరోజులొస్తాయని నమ్మకంలేక పారిపోయాడు. రెండేళ్ళయింది. ఎక్కడున్నాడో, ఏమో? తింటున్నాడో, పస్తులుంటున్నాడో తెలీదు."

మోహన్ కి వూపిరి అందడంలేదు.

"మీరు మా ఇంటికి వస్తే నిజంగా




మా అన్నయ్యే ఇంటికి వచ్చినట్లుంది.''

మోహన్ బరువుగా గాలి పీల్చుకుని, లేచి నుంచున్నాడు. అతని మనసు ఆర్ద్రమయి జాలితో నిండిపోయింది. ఏదో తెలియని జన్మాంతర బంధం తనకూ, ఆ కుటుంబానికీ పెనవేసుకుని వున్నట్లుగా ఫీలయ్యాడు. వసంతను దగ్గరగా తీసుకుని, ఆమె తలమీద చేత్తో నిమిరాడు. ''నీకు భయంలేదు చెల్లీ! నేనే నీ అన్నయ్యననుకో'' అన్నాడు వుద్వేగంగా.

అతని మాటలకు వసంత కళ్ళల్లో కొత్త ఆశలు మెరిశాయి.

ఆ ఇంటిలో దీపం వెలిగినట్లు, ఆమె మొహంలో క్రొత్త వెలుగు!

''అమ్మను ఓ మంచి డాక్టరుకు చూపిద్దాం. చెల్లికీ ఏదో ఓ ఏర్పాటు చేద్దాం. నువ్వేం భయపడకు.'' అని చెప్పి ''మరి నేను వెడతానండీ'' అని ఆ తల్లి దగ్గర శలవు తీసుకున్నాడు.

అతన్ని ఆ సందు చివరివరకూ దిగబెట్టి వచ్చింది వసంత.

ఆ గదిలో దేవుడిముందు వెలిగించిన దీపం మునుపెన్నడూ వెలగనంత దేదీప్యమానంగా వెలుగుతోంది. వసంత రెండు చేతులూ జోడించింది.

''భగవాన్, నాకు మడులొద్దు. మాన్యాలొద్దు. సిరులూ, సంపదలూ వద్దు. పెళ్ళిచేసుకోవాలనీ, సంసారం చేయాలని పెద్దపెద్ద ఆశలేం లేవు. కాని మా అమ్మ మామూలుగా తిరుగుతుందని, నా చెల్లి జీవితం లోటులేకుండా జరుగుతుందని, తమ్ముడూ, నేనూ అకలితో చచ్చిపోమని నాకు ధైర్యం ఇవ్వు! యీ నిప్పుల సముద్రాన్ని యీదుతాను. ఈ వేదనల వడగళ్ళ వానలో తడుస్తాను. ఆ తల్లికి కూతురిగా, చెల్లికి అక్కగా,

అంతకుమించి మనిషిగా అది నా ధర్మం. నువ్వు సాయం చేయొద్దు. కాని యీ నావ ఒడ్డుకు చేరుకుంటుందని నాకు రవ్వంత ధైర్యం ఇవ్వు."

* * *

మోహన్‌కి నిద్రరావడంలేదు.

అతని గుండెను ఎవరో కత్తితో చీలుస్తున్నట్లు గిలగిల్లాడిపోతున్నాడు.

సిగరెట్టు వెలిగించి రెండు దమ్ములు లాగాడు.

"పుట్టినప్పుడు ప్రతి ఒక్కడూ మనిషే! అతడు పెరిగిన పరిసరాలూ, అతడు నేర్చుకున్న సంస్కారం మనిషిగానో, పశువుగానో నిలబెడతాయి. ప్రతి పశువూ కూడా సిగ్గుపడి, లెంపలు వేసుకుని, తను నడుస్తున్న బాట మార్చుకోవలసిన పరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొంటుంది" అనుకున్నాడు.

తనమీద తనకే అసహ్యం వేస్తోంది. ఒకసారి గతం గుర్తుకు తెచ్చుకుంటే.

హేమ, సుందరి గుర్తుకువచ్చి నిలువునా వణికిపోయాడు.

వసంత కళ్ళముందు కదిలింది దీనంగా.

పక్షవాతంతో తీసుకుంటున్న ఆ తల్లీ, కాళ్ళులేని చెల్లీ తన కాళ్ళమీద పడి ఏడుస్తున్నట్లుగా భయపడిపోయాడు.

"భగవాన్! నాకు వూహ తెలిసిన తరువాత ఒక్క మంచి పనీ చేసి వుండక పోవచ్చు. కాని ఒక చెడ్డపనిని విరమించుకున్నానన్న సంతృప్తినైనా దక్కనీయి" అని చేతులు జోడించాడు.

"నేను యీ క్షణంనుంచీ క్రొత్త జీవితం ప్రారంభిస్తాను. అందుకు కావలసిన మనోబలాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ నాకు ప్రసాదించు స్వామీ" అని వేడుకున్నాడు.

ఆ రాత్రి అతనికి కలత నిదురే అయింది.

ఉదయం లేచేటప్పటికి కళ్ళు మంటలు పుడుతున్నాయి.

ఒళ్ళు వెచ్చగానూ, నొప్పులుగానూ వుంది.

ఆ మధ్యాహ్నం భోజనం మానేసి పడుకున్నాడు. సాయంత్రమయేటప్పటికి జ్వరం ఫెళ్ళున కాసింది. ఓ రెండు మాత్రలు మింగి, పాలు తాగి పడుకున్నాడు.

ఆ మర్నాడూ కొద్దిగా జ్వరం వుంది. ఆఫీసుకు శలవు పెట్టాడు.

మరుచటిరోజుకు జ్వరంతగ్గింది. నీరసం ఎక్కువయింది. విశ్రాంతికోసం శలవు పెట్టేశాడు.

* * *

"జడుసుకుని, జ్వరం తెచ్చేసుకున్నాడోరే, మోహన్‌గాడు." అన్నాడు శర్మ కాఫీ సిప్ చేస్తూ కాంటీన్‌లో.

"ఇంతకీ చెప్పుతో కొట్టిందో, చేత్తో కొట్టిందో చెప్పాడా?" అన్నాడు సోమయాజి కుతూహలంగా.

సుబ్బారావుకి కోపం వచ్చింది సోమయాజి తెలివి తక్కువ ప్రశ్నకి. "అది నన్ను చెప్పుతో కొట్టిందని చెప్తూ కుంటాడ్రా ఏ సన్నాసి వెధవైనా?" అన్నాడు కోపంగా.

"ఏమంటాడయితే?"

"మీరు మా అన్నయ్యలాగున్నారు-అని చెప్పి- 'అన్నయ్యా' అని పిలిచిందట. వీడు 'చెల్లీ' అని కావిలించుకుని వచ్చేశాట్ట!" అన్నాడు సుబ్బారావు కసిగా, వ్యంగ్యంగా.

అందరికీ అవమానంగా వున్నా, శేషగిరికి మాత్రం చాలా సంతోషంగా వుంది.

ఆ రోజు పెద్ద హీరోలాగ సైకిలాపి "వసంత నాగి. ఆమె జోలికొచ్చావంటే మూసీ నదిలో ముంచేస్తాను." అంటూ డా అంతమంది జనంలో అని పళ్లు నూరాడు.

కాగల కార్యం గంధర్వులే చేస్తారు-అని భలే అయింది, అనుకుని నవ్వుకున్నాడు.

"ఈ శుభ సందర్భంలో మీ అందర్నీ ప్లాజాకి తీసుకెడుతున్నానురా. సెకండ్ షో- బ్లోహాట్, బ్లోకోల్డ్." అని ప్రకటించాడు అందరివంకా గర్వంగా చూస్తూ.

శర్మ మొహం అప్పనంగా సినిమా అనేటప్పటికి కలువపువ్వులా వికసించింది. "అయితే మీరంతా, సరిగ్గా ఆరున్నరకి మోహన్‌గాడి రూముకొచ్చేయండోరే! వాడికో సంతాప సభ ఏర్పాటుచేసి, ఆనక సినిమా కెడదాం. సభకి ప్రెసిడెంటు, గౌరవనీయులు శేషగిరిగారే," అన్నాడు నవ్వుతూ.

ఆ సాయంత్రం శర్మా, సుబ్బారావూ, శేషగిరీ మోహన్ గది చేరేటప్పటికి అతను మంచంమీద పడుకుని సిగరెట్టు కాల్చుకుంటూ, ఏవో తెలీని సత్యాల కోసం అన్వేషిస్తున్న మహాముని లాగా, దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

మంచానికెదురుగావున్న రెండు కుర్చీల్లో శర్మా, శేషగిరీ కూర్చున్నారు. సుబ్బారావు ఓ కాలు భూమ్మీద ఆన్చుకుని కిటికీలో కూర్చున్నాడు.

గదినిండా చిందరవందరగా, కాల్చిన సిగరెట్లు పడివున్నాయి.

శర్మ ఉపోద్ఘాతం ప్రారంభిద్దామనుకొన్నంతలో సోమయాజి వచ్చాడు. కూర్చోడానికి ఎక్కడా చోటులేక, మోహన్ పడుకున్న మంచంమీదే, తల దగ్గరగా కూర్చున్నాడు. "నువ్విలా బెంగ పెట్టేసుకుని, దిగులుగా మంచాన పడిపోతే ఎలారా? ఏ చేత్తో ఏ చెంపమీదకొట్టిందో ఆ చేత్తోనే అదే చెంపమీద ప్రేమగా నిమిరే రోజులొస్తాయని ధైర్యంగా వుండాలిగాని" అన్నాడు.

మోహన్ పౌరుషంగా, పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు. "నన్ను చెంపమీద కొట్టే ధైర్యం యీ సిటీలో ఏ ఆడదానికీ లేదు" అన్నాడు సోమయాజిని కోపంగా చూస్తూ.

శర్మ వ్యంగ్యంగా నవ్వాడు. "అయితే మరేం జరిగిందిట? అబ్బాయిగారు గాజులే వేయించుకుని ఎందుకొచ్చేశారట?" అని తను ఎంత గొప్ప ప్రశ్న అడిగానో చూడండన్నట్లు మిత్రులందరివైపూ చూసాడు.

మోహన్ బోనులోనుంచుని సంజాయిషీ చెప్పుకుంటున్న ముద్దాయిలా మొహం పెట్టాడు. "ఇంతవరకూ ఆడదంటే మగాడి కోరిక తీర్చే సాధనంగానూ, వండి వార్చే బానిసగానూ ఆలోచిస్తూ వచ్చాం. కాని మన దృక్పథం

తప్పని, స్త్రీ మగాడికంటె ఎంత బాధ్యతాయుతంగా వుంటుందో చూపించింది వసంత! కష్టాలలో పుట్టి, కష్టాలలో పెరిగిన వసంత అన్నయ్య ఆ కష్టాలలోనే కడతేరిపోవాలేమోనన్న భయంతో తల్లినీ, చెల్లెళ్ళనీ వదిలి పారిపోతే, వసంత ధైర్యంగా నడుం బిగించి, పక్షవాతంతో తీసుకుంటున్న ఆ ముసలి తల్లినీ, రెండు కాళ్ళూ లేని అవిటి చెల్లిని సాకుతూ, తను ఉద్యోగం చేస్తూ తమ్ముణ్ణి చదివిస్తోందిరా! వసంత నిజంగా స్త్రీ కాదు—ఒక దేవత! ఆ దేవతను ముట్టుకుంటే కళ్ళు పోతాయి'' అన్నాడు బరువుగా నిశ్వసిస్తూ.

శర్మ, సుబ్బారావు పగలబడి నవ్వారు.

"నువ్వు ఏ తెలుగు సినిమాకైనా డైలాగులు రాస్తున్నావేమిట్రా?'' అన్నాడు వెక్కిరింపుగా సోమయాజి.

"ఒరేయ్, మీరు నమ్మండి—నమ్మకపోండి. వసంత నన్ను 'అన్నయ్యా' అని పిలిస్తే నా మనసు పులకించిపోయింది.''

"ఆవిడ 'అన్నయ్యా' అని పిలిస్తే నువ్వు 'చెల్లీ!' అని కావిలించుకున్నావన్న మాట'' అని వ్యంగ్యంగా, గట్టిగా నవ్వాడు సుబ్బారావు ఎంత అసందర్భంగావుందో చూడండన్నట్లు.

"ఆరేళ్ళ కుర్రదాన్ని చెల్లీ అను! అరవైయేళ్ళ ముసలిదాన్ని తల్లీ అను. తప్పులేదు. కాని పదారేళ్ళ పడుచుదాన్ని చెల్లీ తల్లీ అంటె నీకు దృష్టి దోషమైనా వుండాలి, పిచ్చెక్కయినా వుండాలి లేక...'' అని ఠక్కున ఆగిపోయాడు సోమయాజి ఉగ్రుడైపోతున్న మోహాన్ని చూసి భయంతో.

"లేక ఇంపొటెంట్ వెధవ్వయినా అయుండాలి.'' అని ముగించాడు సుబ్బారావు నిర్భయంగా.

ఓ గొప్ప సత్యాన్ని బట్ట బయలు చేసినంత ఆనందంగా ఘొల్లుమని నవ్వారు మిత్రులంతా.

తుప్పుపట్టిన కత్తిని గుండెల్లో గుచ్చినట్లు కలుక్కుమంది మోహన్‌కి. వాళ్ళ నవ్వులు ములుకుల్లాగా గుచ్చుకుని, కండ కండనూ చీలుస్తున్నట్లు బాధపడ్డాడు. రక్తమంతా మొహంలోకి పొంగింది. ఆ సుబ్బిగాణ్ణి పీకపిసికి చంపేయాలనిపించింది.

నవ్వి, నవ్వి అలసిపోయిన తరువాత శర్మ వాచీ చూసుకుని, చాలా టయిము ఇక్కడే గడిపేసామని నొచ్చుకున్నాడు.

"వీధిలోకి గాజుల సాయెబు వచ్చినపుడు ఓ డజను కొత్త గాజులేయించుకో. ఈ రూపాయి నోటుంచుకో!'' అని జేబులోంచి రూపాయి నోటుతీసి టేబులు మీద పెట్టాడు శేషగిరి. శేషగిరి అంత గొప్ప జోక్ వేస్తాడని అనుకోని మిత్రులు ఒక్కక్షణం తెల్లబోయి, మళ్ళీ నవ్వారు పగలబడి.

వాళ్ళు బయటకు నడవగానే ఠక్కున గడియవేసుకున్నాడు కోపంగా.

సుబ్బారావన్న మాటలు అతని గుండెను పిండి, పిండి గిలగిల్లాడిస్తున్నాయి. "నువ్వు ఇంపొటెంట్ వెధవ్వయినా అయుండాలి, అయుండాలి అయుండా''లంటూ ఆ గది గోడలు కూడా నవ్వుతూ ప్రతిధ్వనిస్తున్నట్లు



'రామ్ - రహీమ్'లో చంద్రమోహన్, రోజారమణి

అతని చెవుల్లో గింగుర్లుమంటున్నాయి.

పౌరుషంగా, కసిగా, క్రూరంగా, గట్టిగా, పిచ్చెక్కిన మనిషిలా "నోర్ముయ్!" అని అరిచాడు ఆ గది గోడలు కూలిపోయేలా మోహన్!

*    *    *

ఆ రోజుకూడా మోహన్ ఆఫీసుకు రాకపోవడంతో వసంత మనసు బెంబేలెత్తిపోయింది. అప్పుడే నాలుగో రోజు. రెండురోజులక్రితం మోహన్ సెక్షన్‌లో అడిగితే జ్వరం అని చెప్పారు. ఇంకా తగ్గలేదంటే, ఒకవేళ టయిఫాయిడు కాదుగదా అని భయపడిపోయింది.

బెదురు గుండెతో, ఏం వినవలసి వస్తుందోనన్న భయంతో సోమయాజి సీటుకు వెళ్ళింది.

"నిన్న నేను వెళ్ళేటప్పటికి నూట రెండు జ్వరం. చెల్లీ-చెల్లీ అని కలవరిస్తున్నాడు. ఆ చెల్లెలు మీరే కాబోలు." అన్నాడు వ్యంగ్యాన్ని మిళాయించి.

"టైఫాయిడు కాదుగదండీ" అంది భయంభయంగా.

"ఇప్పుడు మామూలు జ్వరమే. మీరు చూడకపోతే టైఫాయిడులోకి దింపవచ్చు." అన్నాడు వెటకారంగా.

వసంత మనసంతా దిగులుగా వుంది. జ్వరమొస్తే ఓ గుక్కెడు కాఫీ నీళ్ళయినా కాసిపోయడానికి ఆడదిక్కు లేకుండా వుంటున్నాడు. ఈ నాలుగు రోజులనుంచీ ఏమైనా తిన్నాడో, లేదో అని ఆమె గుండె చెరువయిపోయింది.

సోమయాజి నడిగి, ఇంటి అడ్రసు

తీసుకుంది. ఆమెకి యే పనీ చేయ బుద్ధి కావడంలేదు. ఆమె రెండు కళ్ళూ గడియారం మీదే వున్నాయి. యుగాలు గడిచినట్లు ఒక్కో నిముషమూ గడుస్తోంది.

అయిదు గంటలకి, జైలులోంచి బయటపడ్డ మనిషిలాగా గట్టిగా నిశ్వశించి, ఆత్రుతగా బయలుదేరింది.

ఏమీ కష్టం లేకుండానే, ఆ యిల్లు కనుక్కోగలిగింది.

ప్రకృతి కాంత నల్లచీర కట్టుకుంటూ ముస్తాబవుతోంది. చీరకద్దిన తళుకు ముక్కల్లాగ అక్కడక్కడ దీపాలు వెలుగుతున్నాయి.

వసంత నెమ్మదిగా తలుపు తోసింది. గది చీకటిగా వుంది. లైటు వేసింది. మోహన్ దీర్ఘంగా ఆలోచిస్తున్న మనిషిలాగా గంభీరంగా పడుకున్నాడు మంచం మీద. సగం కాల్చి విసిరేసిన సిగరెట్లు గదంతా చిందర వందరగాపడివున్నాయి.

"ఇప్పుడెలా వుందన్నయ్యా, ఏమైనా తగ్గిందా?" అంది కుర్చీ మంచానికి దగ్గరగా లాక్కుంటూ. అతడి నుదుటిమీద, కణతలమీద చేయివేసి చూసింది వేడిగా వుందేమోనని.

అప్పుడే చైతన్యం వచ్చిన మనిషిలాగా ఆమె కళ్ళల్లోకి చూసాడు మోహన్. ఆ కళ్ళల్లో మెరుపులు అతన్ని పిచ్చివాణ్ణి చేసాయి. కణతలమీది ఆమె చేయి అతని నరాల్లో విద్యుత్తును పుట్టిస్తోంది. గదిగోడలు సుబ్బారావన్న మాటలు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తుంటే, చెవులు గింగుర్లు మంటున్నాయి. "నువ్వు ఇంపోటెంట్




# శ్రీ బాలాజీ వైద్యశాల

డా|| పి. కుమారస్వామి దేవర
మార్వాడీ గుడివద్ద ఫోన్ : 551, తెనాలి (ఏ.పి.)
బ్రాంచి : 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

**దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము**

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నలు, కుష్టు - బొల్లి, చర్మ వ్యాధులు హెర్నియా (గిలక), పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం, దగ్గులకు ఉచిత వైద్యం. రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ బాగు చేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను

వైధవ్యయినా అయుండాలి.''

అతని రక్తం మరిగి మరిగి గుండెల్లోకి ఎగదన్నింది.

పొదలోంచి లేస్తున్న పెద్దపులిలాగా లేచాడు మంచంమీంచి. అతని కళ్ళల్లోంచి కోరికల నిప్పుల రవ్వలు కురుస్తున్నాయి. ఆమె నడుంచుట్టూ చేతులువేసి, దగ్గరగా లాక్కున్నాడు.

చావుదెబ్బకొట్టడానికి పంజాపైకెత్తిన పెద్దపులికి, అసహాయంగా రెండుచేతులూ జోడించిన జింకపిల్లలా ''ఏమిటన్నయ్యా ఏమిటిది?'' అంది భయవిహ్వలయి.

ఆమె బుగ్గల్ని గట్టిగా కొరికి ఆమెని మంచంమీదికి తోసాడు.

''అన్నయ్యా,'' అంది రాబోయే ఆపదను వూహించి, తల్లికోసం అరిచిన లేడిపిల్లలా.

ఆమె పెదాలను తన పెదాలతో నొక్కిపెట్టి, మరి అన్నయ్యా అననివ్వలేదు.

ఆమె పెనుగులాట మరింత రెచ్చగొట్టింది.

కోరికతో కాలిపోతున్న పశువులాంటి మగాడిముందు, అర్భకురాలైన ఆడపిల్ల ఎంత?

ఆ గదిలో గాలిదేవుడు భయంతో గడ్డకట్టుకుపోయాడు.

నేనీ దారుణాన్ని చూడలేనన్నట్లు చంద్రుడు మబ్బుదుప్పటీ కప్పుకున్నాడు.

కండకండనూ చీల్చి తిని, తృప్తిగా త్రేన్చిన పెద్దపులిలాగా మత్తుగా ఆమె చుట్టూ చేతులువేసి పడుకున్నాడు మోహన్.

కొండచిలువల్లా తన మెడను పెన వేసుకున్న చేతుల్ని బలంగా విడదీసి లేచి నుంచుంది వసంత. ఎముకలన్నీ విరిగిపోయినట్లు ఒళ్ళంతా నొప్పులుగావుంది. కళ్ళ ముందు చీకటితప్ప మరేమీ కన్పించడంలేదు. కాళ్ళు భూమ్మీద నిలవలేమంటూ తేలిపోతున్నాయి.

ఎదురుగా గోడకు తగిలించిన కేలెండరులోని దేవుడికి రెండుచేతులూ జోడించింది క్షమాపణ కోరుకుంటున్న మనిషిలా దేవుడు తలదించుకున్నాడు. ఆమె కళ్ళల్లోకి చూడ్డానికి దేవుడికెక్కడా ధైర్యం చాలడంలేదు.

* * *

ఆ ఇల్లంతా చీకటిగావుంది.

నాలుగు పశువులమధ్య పెరిగిన ఒక మనిషి ఆవేశానికి_అర్ధంలేని పౌరుషానికి అగ్నికీలలాంటి కోరికకి బలైపోయిన బ్రతుకులాగ, చీకటిగా, భయంకరంగా వుంది ఆ యిల్లంతా.

చిరుదీపమైనా వెలిగించడానికి ఆ ఇంటికి ఎవ్వరూలేరు.

మంచానికి శిలువ వేసిన మనిషిలా ఆ తల్లి.

ఆ తల్లి కాళ్ళమీద వసంత,

ఏడ్చి ఏడ్చి ఎండిపోయిన కళ్ళల్లోంచి

కనుకొలకుల మీంచి

చెంపలమీదుగా ధారలు...

ఆ కంటినుంచి కారేవి కన్నీళ్ళుకావు_

రక్తపు చక్కాలు! ★